# అభివృద్ధిచేశా మరోసారి అవకాశం ఇవ్వండి

**● ఎమ్మెల్యే అభ్యర్థి దానం నాగేందర్**



బసవతారకం నగర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి దానం నాగేందర్

బంజారాహిల్స్, నవంబర్ 27: ఖైరతాబాద్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి దానం నాగేందర్ ముమ్మరంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. బస్తీలలో ఇంటింటి ప్రచారాలు, రోడ్ షోలతో పాటు ప్రజా ఆశీర్వాద సభల పేరుతో కార్నర్ మీటింగ్స్ నిర్వహిస్తూ మద్దతు కూడగడుతున్నారు. పేదల కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో పాటు బీఆర్ఎస్ మ్యానిఫెస్టోలో ప్రకటించిన కొత్త పథకాలను గురించి అవగాహన కల్పిస్తున్నారు. కాలనీలు. అపార్ట్‌మెంట్ వాసులతో ప్రత్యేకంగా సమావేశాలు నిర్వహిస్తూ నగరంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని వివరిస్తున్నారు. కరెంట్ కష్టాలు, ట్రాఫిక్ ఇబ్బందులు, మంచినీటి సమస్యలను బీఆర్ఎస్ ప్రభుత్వం తీర్చిందని దానం నాగేందర్ ఓటర్లకు వివరిస్తూ రానున్న ఎన్నికల్లో మరోసారి గెలిపించాలని కోరుతున్నారు. సోమవారం బంజారాహిల్స్ రోడ్ నం.1లోని జలగం వెంగళరావు పార్కులో స్థానిక కార్పొరేటర్ మన్నె కవితారెడ్డితో కలిసి వాకర్లను కలిసి బీఆర్ఎస్‌కు ఓటేయాలని అభ్యర్థించారు. ఫిలింనగర్‌లోని బసవతారకం నగర్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి దానం నాగేందర్, జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేశ్‌తో కలిసి రోడ్‌షో నిర్వహించారు. పేదలందరికీ గృహలక్ష్మి పథకం ద్వారా రూ.3లక్షల ఆర్థిక సాయం చేస్తామని, రూ.400కే గ్యాస్ సిలిండర్ అందిస్తామని, రూ.15లక్షల ఆరోగ్య భీమా, రేషన్ కార్డుల మీద సన్నబియ్యం అందిస్తామని దానం హామీ ఇచ్చారు.



జలగం వెంగళరావు పార్కులో వాకర్లతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి దానం నాగేందర్

## దానం నాగేందర్‌కు టీడీపీ నేతల మద్దతు



దానం నాగేందర్‌కు మద్దతు తెలుపుతున్న టీడీపీ నేతలు

ఖైరతాబాద్, నవంబర్ 27 : రాష్ట్రాన్ని పది సంవత్సరాల కాలంలో అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన బీఆర్ఎస్‌ను మూడో సారి గెలిపించుకోవాలని ఆ పార్టీ ఖైరతాబాద్ అభ్యర్థి, ఎమ్మెల్యే దానం నాగేందర్ కోరారు. పంజాగుట్టలోని పోచమ్మబస్తీలో ఎమ్మెల్యే దానం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు మద్దతునిస్తున్నట్లు ప్రకటించగా, ఎమ్మెల్యే వారికి కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ప్రజా సంక్షేమ పథకాలే హ్యాట్రిక్ విజయాన్ని అందిస్తాయన్నారు. 30న జరిగే ఎన్నికల్లో భారీ విజయాన్ని అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సోమాజిగూడ డివిజన్ కార్పొరేటర్, జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు వనం సంగీత యాదవ్, బీఆర్ఎస్ నాయకులు సలావుద్దీన్, పోచమ్మబస్తీ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విజయ్ కుమార్, భానుప్రకాశ్, యాదేశ్, రాజు పాల్గొన్నారు.

## కేంద్ర బలగాల కవాతు..



శాసనసభ ఎన్నికలను పురస్కరించుకుని ఖైరతాబాద్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో కేంద్ర సాయుధ బలగాలు కవాతు నిర్వహించాయి. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, పంజాగుట్ట, ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ల పరిధిలోని ప్రధాన వీధులతో పాటు బస్తీలు, కాలనీల్లో సోమవారం సాయంత్రం స్థానిక పోలీసులతో కలిసి కవాతు నిర్వహించాయి. పోలింగ్‌ను ప్రశాంతంగా నిర్వహించడంతో పాటు ఓటర్లకు భరోసా కల్పించేందుకు కవాతు నిర్వహిస్తున్నామని పోలీసులు తెలిపారు.


– బంజారాహిల్స్, నవంబర్ 27

## బీఆర్ఎస్‌తోనే నగరం అభివృద్ధి



బంజారాహిల్స్ రోడ్ నం. 13లోని సాయినగర్ కాలనీలో ప్రచారం నిర్వహిస్తున్న నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

బంజారాహిల్స్, నవంబర్ 27: తొమ్మిదిన్నర ఏండ్లలో తెలంగాణ రాష్ట్రం సాధించిన అభివృద్ధితో అన్ని వర్గాల ప్రజలు మరోసారి బీఆర్ఎస్ పార్టీకే మద్దతు ఇవ్వాలని భావిస్తున్నారని జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. ఖైరతాబాద్ నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి దానం నాగేందర్‌కు మద్దతుగా బంజారాహిల్స్ రోడ్ నం.13లోని సాయి నగర్ కాలనీ వాసులతో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి సమావేశమయ్యారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓటేసి హైదరాబాద్ అభివృద్ధిని కొనసాగించేందుకు మరో అవకాశం కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో కరెంట్ కష్టాలు తీర్చడంతో పాటు మౌలిక సదుపాయాల కల్పనలో దేశంలోనే రాష్ట్రాన్ని మొదటిస్థానంలో నిలిపిన బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని మరోసారి గెలిపించాలని కోరారు. ప్రశాంతమైన హైదరాబాద్‌లో మతపరమైన అల్లర్లను సృష్టించే కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. కాలనీలు, అపార్ట్‌మెంట్ వాసులు తప్పనిసరిగా ఓటు వేసేందుకు రావాలని సూచించారు. అనంతరం బంజారాహిల్స్ రోడ్ నం.11లోని దావూద్ జంగ్ కాలనీవాసులతో సమావేశమయిన మేయర్ రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి మరోసారి ఓటెయ్యాలని కోరారు.



శ్రీరాంనగర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న మేయర్ విజయలక్ష్మి

## డబ్బులు పంచడాన్ని అడ్డుకున్నందుకే ఆరోపణలు

ఖైరతాబాద్, నవంబర్ 27 : ఖైరతాబాద్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డబ్బులు పంచుతుండటాన్ని గుర్తించి ఫిర్యాదు చేసినందుకే తాము న్యూసెన్స్ చేస్తున్నామని పోలీసులకు తప్పుడు ఫిర్యాదు చేశారని బీఆర్ఎస్ నాయకులు మహేశ్ యాదవ్ అన్నారు. సోమవారం ఖైరతాబాద్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. రెండు రోజుల క్రితం బీజేఆర్ నగర్‌కు చెందిన తన స్నేహితుడి పుట్టిన రోజు కావడంతో పార్టీ చేసుకొని రాత్రి 11గంటల సమయంలో ఇంటికి వస్తుండగా, కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డబ్బులు పంచుతున్నారని తెలియడంతో తనతో పాటు బీఆర్ఎస్ నాయకులు మురళి, శ్యామ్‌తో కలిసి వెళ్లి చూసి, వెంటనే ఎన్నికల అధికారి, ఇన్స్‌పెక్టర్లకు సమాచారం ఇచ్చామన్నారు. ఫోన్‌లో ఫొటోలు తీయగా, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తమపై దుర్భాషలాడారన్నారు. మద్యం పంపిణీ చేసిన కాంగ్రెస్ నాయకులను అరెస్టు చేయాలని వారు కోరారు.

## లంగ్ క్యాన్సర్ చికిత్సలో.. నిమ్స్ ముందంజ



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డైరెక్టర్ బీరప్ప

ఖైరతాబాద్, నవంబర్ 27 : ప్రైవేట్, కార్పొరేట్ దవాఖానలకు దీటుగా లంగ్ క్యాన్సర్‌కు ఆధునిక చికిత్స అందిస్తూ నిమ్స్ ముందంజలో ఉందని డైరెక్టర్ డాక్టర్ బీరప్ప అన్నారు. నిమ్స్ మెడికల్ ఆంకాలజీ విభాగం ఆధ్వర్యంలో ట్రామా బ్లాక్‌లోని ఆడిటోరియంలో 'లంగ్ క్యాన్సర్ కెలిడీయోస్కోప్ 2023' పేరుతో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సును డాక్టర్ బీరప్ప ప్రారంభించి మాట్లాడుతూ.. ప్రతి వంద మంది ఊపిరితిత్తుల క్యాన్సర్ బాధితుల్లో 20 మంది ఎక్కువ కాలం జీవించేలా చికిత్స అందిస్తున్నామన్నారు. అవగాహన లేక చాలా మందిలో గుర్తించలేకపోతున్నామని, సకాలంలో ఊపిరితిత్తుల క్యాన్సర్‌ను గుర్తిస్తే మెరుగైన చికిత్స అందించవచ్చని అన్నారు. అనంతరం లంగ్ క్యాన్సర్ నివారణపై క్విజ్ పోటీలు నిర్వహించి ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు. నిమ్స్ ఆంకాలజీ విభాగాధిపతి సదాశివుడు, ఎగ్జిక్యూటివ్ రిజిస్ట్రార్ శాంతివీర్, ప్రొఫెసర్లు సాయిబాబు, ఉషారాణి, పరంజ్యోతి పాల్గొన్నారు.

## ఆలయాలకు కార్తిక శోభ



కార్తిక పౌర్ణమి సందర్భంగా సోమవారం ఆలయాలు కిక్కిరిసిపోయాయి. తెల్లవారుజామునుంచే వందలాది మంది భక్తులు ఆలయాలకు వచ్చి దీపాలు వెలిగించారు. శివాలయాల్లో స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. శ్రీనగర్ కాలనీలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తులు సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు.

– బంజారాహిల్స్, నవంబర్ 27

